www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 27 మే 2023

ఆకట్టుకున్న హోమ్ ఎక్స్‌పో ప్రదర్శన

హోమ్ ఎక్స్‌పో ప్రదర్శనలో నిర్వాహకులు

మదనపల్లె అర్బన్: స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో మదనపల్లె అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోమ్ ఎక్స్‌పో 2023 (బిల్డింగ్ మెటీరియల్ ప్రదర్శన) ఆకట్టుకుంటున్నట్లు ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ తెలిపారు. హోమ్ ఎక్స్‌పో కార్యక్రమం ఇక్కడ గృహ నిర్మాణాలు చేపట్టే వారికి అవసరమైన అన్ని రకాల వస్తువుల స్టాళ్లతో పాటు ఇంటీరియర్ డెకరేటింగ్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గృహ నిర్మాణానికి సంబంధించి దాదాపు 30 వివిధ రకాల నిర్మాణ, పనిముట్లను ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. మొదటిరోజు పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తాము ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించినట్లు తెలిపారు. ఈ ప్రదర్శ రెండు రోజులు పాటు కొనసాగుతుందని, కావున మదనపల్లి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మహేంద్ర బాబు, ట్రెజరర్ రెడ్డి నాగరాజు, ఇసి మెంబర్ సురేష్ బాబు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రి నిర్మించాలి

ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

రాయచోటి : ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంగా 30 పడకల ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎ.రామంజులు, ఉపాధ్యక్షులు ఎస్.ఓబులమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీడీ కార్మికుల ఆసుపత్రి వద్ద జరిగిన సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయాలని జరిగిన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికుల వైద్యం కోసం నిర్మించిన ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకుందన్నారు. రెగ్యులర్ వైద్యులు తగినంత స్టాఫ్ లేరని శ్రీకాళహస్తికి చెందిన డిస్పెన్సరీ డాక్టర్ వారంలో కేవలం బుధ, గురు వారాల్లో మాత్రమే ఉంటారని తెలిపారు. మిగిలిన రోజులు రోగుల పరిస్థితి ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఇఎస్ఐ స్కీమ్ ద్వారా కార్మికుల ఉద్యోగులకు మందులు, సిక్ లీవులు నిరుద్యోగభృతి, పెన్షన్లు వంటి తదితర సౌకర్యాలకు తమ జీతంలోని కొంత నగదును ఎంప్లాయ్ మెంట్ స్టేట్ ఇన్సూరెన్స్ పేరుతో రిజర్వ్ బ్యాంక్‌లో జమ చేసిన లక్షా పదివేల కోట్లు ఉందన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగబసిరెడ్డి, సిఐటియు నాయకులు విజయ, సిద్ధమ్మ, బీడీ కార్మికులు లక్ష్మిదేవి, అన్సారీ, రమీజా, గంగులమ్మ, బదరీనాథ్‌లతో పాటు పలువురు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయాలి

మదనపల్లె అర్బన్ : కార్మికులకు ఆసుపత్రి, మందులు, పెన్షన్లు, సిక్ వేతనాలు, నిరుద్యోగ భృతి తదితర సౌకర్యాలు కల్పించే ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) పథకాన్ని బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇఎస్ఐ డిస్పెన్సరీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇఎస్ఐ పథకాన్ని నీరుగారుస్తున్నాయని విమర్శించారు. దేశమంతటా ఇఎస్ఐ పథకాన్ని 2022 కల్లా విస్తరించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ అది ఎక్కడా అమలు కాకపోవడం శోచనీయమన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రులు డాక్టర్లు, పరికరాలు, సిబ్బంది, మందుల లేమితో కునారిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాల్లోనూ కనీసంగా 30 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, తన బాధ్యతలను నిర్వర్తించకుండా మొత్తం కేంద్ర ప్రభుత్వంపై నెట్టిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతారాహిత్యానికి వ్యతిరేకంగా కార్మికులను సిఐటియు ఐక్యం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇఎస్ఐ డిస్పెన్సరీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గంగాదేవి, నాయకులు గోపాల్, రెడ్డిప్రసాద్, రమణ, కార్తీక్, రమణమ్మ పాల్గొన్నారు.

మదనపల్లె : నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

బదిలీల జాతర!

ఉద్యోగుల్లో టెన్షన్..టెన్షన్..

రాజకీయ సిఫారసుల కోసం పరుగులు

జిల్లా పరిషత్ ఉద్యోగుల పైరవీల వెల్లువ

నేటి నుంచి కసరత్తు షురూ

ఉమ్మడి జిల్లాలో బదిలీల జాతర మొదలైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్లుగా ఒకేచోట బాధ్యతలు నిర్వహించిన ఉద్యోగులకు బదిలీ అనివార్యం. రెండేళ్లు నిండిన ఉద్యోగులు తమ అవసరాల రీత్యా దరఖాస్తులు చేసుకుంటే క్లియర్ వేకెన్సీ ఉంటే బదిలీ లకు అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 120 డిపార్టుమెంట్లకు చెందిన సుమారు 25 వేల మంది ఉద్యోగులు ఉన్న సంగతి తెలిసిందే. వీరిలో ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పని చేసిన ఉద్యోగులు వేలాది మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 27వ తేదీ లోపు రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేషన్ తదితర ఆప్షన్ల ఎంపికకు గడువు ఇవ్వడం తెలిసిందే. ఇప్పటి వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంపై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల గుబులు పట్టుకుంది. ప్రభుత్వ పరిధిలో 120 డిపార్టుమెంట్లలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో బదిలీపై ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందోననే టెన్షన్ వాతావరణం నెలకొంది. జిల్లా పరిషత్, డిఇఒ, డిఎఒ, డ్వామా, మెప్మా మొదలగు రంగాలతోపాటు ఇతర రంగాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగుల పెద్దఎత్తున బదిలీ కానున్నారు. ఇందులోభాగంగా ఈనెల 27 నాటికి మూడు రకాల ఆప్షన్లను ఎంపిక చేసుకోవాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పని చేసే పలువురు ఉద్యోగులు సమీప, సురక్షిత ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు పైరవీలను ఆశ్రయిస్తున్నారు. రాజకీయ ప్రాపకాన్ని ఆశ్రయించి తమకు కావాల్సిన చోటికి బదిలీ చేయించుకు నేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పలువురు ఉద్యోగులు రాజకీయ సిఫారసులు చేయించుకుని తమకు అవసరమైన ప్రాంతాలకు బదిలీ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. రాజకీయ పైరవీలతో సురక్షిత ప్రాంతాన్ని దక్కించుకున్న ఉద్యోగులు రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా నడుచు కోవాల్సి వస్తోందనే అంశాన్ని గమనంలో పెట్టుకోవాల్సి ఉంది. జిల్లా పరిషత్‌లో సుమారు 1000 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో సుమారు 250 మంది ఉద్యోగులకు బదిలీలకు అవకాశం ఉంటుంది. ఇదేతరహాలో మిగిలిన విభా గాల ఉద్యోగులకు బదిలీలు తప్పడం లేదు. బదిలీల్లో రాజకీయ సిఫారసుల ప్రభావాల ఫలితంగా నిజాయితీగా బాధ్యతలు నిర్వహించడం కష్టమనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లాలోని 120 డిపార్టుమెంట్లలో గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు వివిధ సెక్షన్ల ఉద్యోగుల్లో పలువురు రాజకీయ పైరవీలను ఆశ్రయించడం అవాంఛనీయం. నిజాయితీగా సీనియారిటీ ప్రాతిపదికన తమకు కేటాయించిన ప్రాంతంలో విధులు నిర్వహిస్తే పారదర్శకంగా విధులు నిర్వహించే అవకాశం ఉంటుంది. రాజకీయ పైరవీలతో సురక్షిత ప్రాంతాన్ని దక్కించుకున్న ఉద్యో గులు పారదర్శకంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం కష్టమనే సంగతిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. 2024లో ప్రథమార్థంలో రానున్న సార్వత్రిక ఎన్ని కల నేపథ్యంలో రాజకీయ పైరవీల బాటపట్టిన ఉద్యోగులకు కత్తిమీద సాముసు తలపించే పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుందని గ్రహించాలి.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎపి డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్ బాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో జగనన్నకు చెబుదాం, ప్రయారిటీ బిల్డింగ్స్, వేకెన్సీ పొజిషన్, గడప గడపకూ మన ప్రభుత్వం, హౌస్ సైట్స్, హౌసింగ్, నాడు-నేడు హెల్త్, నాడు-నేడు అంగన్‌వాడీ, నాడు-నేడు స్కూల్, రీ సర్వే, జగనన్న పాల వెల్లువ పలు అంశాలపై కలెక్టర్ గిరీషతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మద్‌బాబు మాట్లాడుతూ జగనన్నకు చెబుతాం ఇది చాలా ప్రతిష్టాత్మకమైన కార్యక్రమన్నారు. ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యతతో ఈ కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. 1902కి వచ్చే ఫిర్యాదుల విషయంలో అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో పోలీస్ 58, ఎపిఎస్‌పిడిసిఎల్ 55, సర్వే సెటిల్మెంట్ 28, ఎంఎయుడి 27, సివిల్‌సప్లై 26, రూరల్ డెవలప్మెంట్ 17, విఎస్ డబ్ల్యూఎస్ 10, రూరల్ వాటర్‌సప్లై 13, ట్రాన్స్‌పోర్ట్ 10, పశుసంవర్ధక శాఖ 6, సెబ్ 5, ఉమెన్ అండ్ వెల్ఫేర్ 5, డిజేబుల్డ్ డిపార్ట్మెంట్ 5 ఫిర్యాదులు అందాయని వాటిపై ప్రాపరగా రిమార్క్ కాలంలో డీటెయిల్‌గా రాసి సమస్యను పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం అందిన ఫిర్యాదులపై సంబంధిత శాఖ జిల్లా అధికారులు కింది స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించాలన్నారు. ఆధార్ సీడింగ్, అకౌంట్ మిస్ మ్యాచ్ తదితర ఎర్రర్స్ వల్ల బిల్లులు ఎన్ని ఉన్నాయి, ఎన్ని రోజుల నుంచి రాలేదు వంటి వివరాలను అడిగి తెలుసుకుని అటువంటి ఎర్రర్స్‌ను త్వరగా క్లియర్ చేసి సకాలంలో బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌లో క్షేత్ర స్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ల్యాండ్ సమస్యల మీద కూడా ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆర్డీఓలను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. జిల్లాలో రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. రీసర్వే మొదట విడతలో చేసినవి ఏవి కూడా పెండింగ్లో పెట్టుకోవద్దన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతానికి కృషి చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. జిల్లాలో జగనన్న పాల వెల్లువ అన్ని గ్రామాలు కవర్ కావాలన్నారు. త్వరగా మ్యాపింగ్, సర్వే పూర్తి చేయాలన్నారు. ఫేజ్ వన్, పేజ్ 2 చాలా బాగా పనిచేశారని, ఫేజ్‌త్రీలో అధికారులు సరిగా పనిచేయటం లేదన్నారు. ఇప్పుడు సేకరిస్తున్న పాల సేకరణ కన్నా మరింత గణనీయంగా పాల సేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎంసీయులు అన్నీ కూడా వర్కింగ్ లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను ప్రతి ఒక్కరు కూడా అచిప్ కావాలన్నారు. రెగ్యులర్‌గా జిల్లాకు వస్తా ఉంటానని, వెనకబడితే మాత్రం సహించేది లేదన్నారు.అంతకుముందు కలెక్టర్ మాట్లాడుతూ మే 9 నుంచి 25వ తేదీ వరకు జగనన్నకు చెబుదాం 827 ఫిర్యాదులు వచ్చాయని, 50.66 శాతం ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా 49.33 శాతం ఫిర్యాదులు పరిష్కరిస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు పరిష్కారంలో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో 6వ స్థానంలో ఉందన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన పిఎంయు టీం జిల్లాస్థాయి, డివిజన్, మండల స్థాయిలో అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయం బిల్డింగులు 242 పూర్తి అయ్యాయన్నారు. ఆర్‌బి కెలు 193, హెల్త్ క్లినిక్లు 106 పూర్తయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ 665 ఖాళీలు ఉన్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పనుల బిల్స్ అప్లోడింగ్‌లో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలోనే టాప్ ప్లేస్‌లో ఉందన్నారు. ఇళ్ల నిర్మాణం కంప్లీషన్‌లో రాష్ట్రంలో 4వ స్థానంలో ఉన్నామన్నారు. మనబడి నాడు నేడు పనులు జూన్ 12 లోపల పూర్తి చేస్తామన్నారు. జగనన్నకు చెబుదాంను అధికారులు సీరియస్‌గా తీసుకొని అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎఎస్‌పి రాజ్ కమల్, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గుర్రంకొండ : నడిమికండ్రిగ సచివాలయాన్ని పరిశీలిస్తున్న అహ్మద్‌బాబు, గిరీష

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

గుర్రంకొండ : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఎపి డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ బాబు సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని నడిమికండ్రిగ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ గిరీషతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై సచివాలయానికి వస్తుంటారని, సచివాలయానికి వచ్చే సర్వీసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అప్పుడే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లె, ఆర్‌డిఒలు, రంగస్వామి, మురళి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

మదనపల్లె అర్బన్: పాడి రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకొని అమూల్‌కు పాల సేకరణ 90 శాతం జరిగేటట్లు చూడాలని అహ్మద్‌బాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని చిప్పిలి అమూల్ పాల డెయిరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల సేకరణ కొరకు అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో జగనన్న పాలవెల్లువ ప్రాముఖ్యతను పాడి రైతులకు తెలియజేసి అమూల్‌కు పాలు పోసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మదనపల్లె, ఆర్ డిఓ మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల ప్రాణ భద్రత మనందరి సామాజిక బాధ్యతని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో రోడ్డు భద్రతా కమిటీతో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలను వివిధ శాఖాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటంతో పాటు క్షతగాత్రులు, మృత్యువాత పడుతుండడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలతో పాటు ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఆ కుటుంబాలు రోడ్డున పడకుండా నివారించగగిలిన వారమవుతమన్నారు. రోడ్డు ప్రమాదానికి ప్రధాన కారణాలు అధికంగా మలుపులు ఉండడం, ప్రమాద హెచ్చరికలు, స్పీడ్ నియంత్రిక సూచికలు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, యూటర్న్ మలుపులు కనిపించక పోవడం, డ్రైవర్ల తప్పిదాలు, మద్యం సేవించి నడపడం, హెల్మెట్ పెట్టుకోక పోవడంతోనే జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబందనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రవాణాశాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే స్థలాన్ని గుర్తించి అక్కడ కనీస భద్రత చర్యలు చేపట్టలన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 34 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. 53 మందికి గాయాలు అయ్యాయన్నారు. ఇకమీదట రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చేపట్టవలసిన చర్యలపై నివేదిక రూపొందించాలని ఆదేశించారు. సమీక్షలో డిస్ట్రిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిణి శాంతకుమారి, అదనపు ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, ఆర్టీసీ, అర్‌అండ్‌బి, జాతీయ రహదారుల అధికారులు, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

నవరత్నాలతో పేదరిక నిర్మూలన :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదరిక నిర్మూలన కోసం నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని, కరోనా లాంటి కష్టకాలంలో సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఆదరువుగా నిలిచాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ, రామ్‌నగర్‌కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గడప గడపకూ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..? ఏమైనా సమస్యలు ఉన్నాయా...? అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయం అన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో తమ ప్రభుత్వానికి కులమత రాజకీయాలతో పనిలేదన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు వెంటనే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే తగిన చర్యలు తీసుకొని మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఇఒ ఉదయ్ కుమార్, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, రాయుడు, రఘు, రమేష్, రవి, ఆనంద, సాధిక్, షాహెద్, సైపుల్లా, రాజేష్, ముని, చికెన్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే క్లబ్ విద్యార్థుల ప్రతిభ అమోఘం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాయచోటిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా చీఫ్ కోచ్ షేక్ షఫీని యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ.ఆర్.సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థుల ప్రతిభను షఫీ అభినందించారు.సురేష్ నేతృత్వంలో విద్య బోధన, క్రమ శిక్షణ గొప్పగా ఉందని షఫీ కొనియాడారు. సీనియర్ గ్రాండ్ మాస్టర్‌గా మీ సేవలను రాయచోటిలోని విద్యార్థులకు అందించాలని షఫీ కరాటే మాస్టర్ సురేష్‌ను కోరారు. చక్కని నైపుణ్యంతో శిక్షణ ఇవ్వడం చాలా గొప్ప విషయమని అలాంటి కరాటే శిక్షణ రాయచోటిలో కూడా ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ శిబిరంలో ఘనంగా నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రం బాగుండాలంటే కాంగ్రెస్ రావాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రం బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి అల్లా బకాస్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టిందని తెలిపారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికింది దుగరాజపట్నం ఓడరేవు వూసే లేదని తెలిపారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు, బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చింది. పోలవరం ప్రశ్నార్థకమైందన్నారు. విశాఖ రైల్వే జోన్ ప్రస్తావనే లేదు, విశాఖ విజయవాడ మెట్రో రైల్ లో వూసే లేదన్నారు. ఆంధ్రుల ఆత్మవివాహానికి ప్రత్యేక అయినా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెడుతుంది, ఆంధ్ర బ్యాంకును కాలగర్భంలో కలిపేసింది, బిజెపి దేశాన్ని అప్పుల భారత్ చేసిందని చెప్పారు. 1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాలలో పండిట్ నెహ్రూ వదులుకొని మన్మోహన్ సింగ్ వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం రూ.46 లక్షల కోట్ల అప్పు చేయగా కేవలం ఎనిమిది సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం అదనంగా రూ.109 లక్షల కోట్లు అప్పు చేసింది. బిజెపి దేశాన్నిఅమ్మకానికి పెట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, రైల్వే స్టేషన్లను అమ్మేస్తుంది. నిరుద్యోగం పెరిగిపోతుంది పెట్రోలు, డీసలు, వంట గ్యాస్ నిత్యవసర సరుకులు ధరలు సామాన్యునికి అందుబాటులో లేవు. బిజెపి కక్ష రాజకీయాలు ఎక్కువయ్యాయని తెలిపారు. ఆరు సూత్రాల కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు సంవత్సరాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. అవి రూ.6 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా, ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.ఆరు వేలు ఆర్థిక సహాయం, సంజీవిని లాంటి ప్రత్యేక హోదా అములు, కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని విధాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎపిసిసి డెలిగేట్ ఎమ్‌డి గౌస్, ఎపిసిసి మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీక్, డిసిసి జనరల్ సెక్రెటరీ ఖదీర్, యువజన జిల్లా అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, ఉతన్న ,అమర్నాథ్ రెడ్డి, మైసరారెడ్డి, వెంకటేశ్వర్లు, జప్రూల్లా, షాజహాన్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు వైవీయూ క్రీడాకారులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో, జిబి నగర్‌లో ఈ నెల 29 నుంచి ప్రారంభమయ్యే ఖేలో ఇండియా యూనివర్శిటీ క్రీడలకు వైవీయూ క్రీడాకారులు పయనమ్యారని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైవీయూ క్రీడాకారులు వెయిట్ లిఫ్టింగ్, బొర్నలి బోరాలు అలాగే అథ్లెటిక్స్, హైజంప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు పతకాలు సాధించి తిరిగి రావాలని పేర్కొన్నారు.

పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతే ప్రారంభించాలి

మదనపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రపతి చేతుల మీదుగానే నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాలని, విడుదలై చిరుతైగల్ కట్చి (విపికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. గిరిజన మహిళా రాష్ట్రపతిని అవమానిస్తూ, ప్రధాని మోడీనే నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో 20 విపక్ష పార్టీలు కలిసి తాము ఈ ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి, మోడీ ప్రభుత్వ దుశ్చర్యను ఖండించడం అభినందనీయమని చెప్పారు. దళిత గిరిజనుల ఓట్లతో గద్దె నెక్కిన వైసిపి, దళిత గిరిజన ఓట్లతో గద్దెనెక్కాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న టిడిపి, నూతన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని ప్రతిపాదించిన బిఆర్ఎస్ పార్టీలు విపక్షాల బాటలో నూతన పార్లమెంటు భవనం, ప్రారంభోత్సవాన్ని బహిష్కరించి, రాజ్యాంగ క్రతువును రక్షించి, దళిత గిరిజన ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. నూతన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలంటూ దేశ ప్రజలు పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నా, ప్రధాని ఏమాత్రం పట్టించుకోవడం లేదని, అంబేద్కర్ పట్ల ప్రధాని నిర్లక్ష్యాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఒక మహిళను రాజ్యాంగం రాష్ట్రపతిని చేసిందని, రాష్ట్రపతి అయినా కూడా ఆ మహిళకు పార్లమెంటు భవనం ప్రారంభించే అర్హత లేదంటూ మనుధర్మశాస్త్రం అడ్డుపడుతోందని, మనుధర్మ శాస్త్రాన్ని తాము వ్యతిరేకించేది అందుకేనని అయన తెలిపారు. సమావేశంలో డిపికె పార్టీ నాయకులు ముత్యాల మోహన్, జి.వి.రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, రాయల్ సూర్య, బురుజు జనార్దన్, గెరివి మల్లేష్ పాల్గొన్నారు.

పీలేరు: పార్లమెంటు కొత్త భవనానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని, ఆ భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ప్రారంభించాలని మాల మహానాడు డిమాండ్ చేసింది. స్థానిక మాలమహానాడు కార్యాలయంలో మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి అనంద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు దేశ ప్రజల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉందన్నారు. ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తుంటే, మన దేశ పాలకులు ఆ గౌరవం ఇవ్వక పోవడం ఇదో నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుబాష్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం లోకనాథం, కార్యవర్గ సభ్యులు తుమ్మల రవి పాల్గొన్నారు.

క్రీడా పోటీల ప్రారంభంలో జడ్‌పి చైర్మన్, ప్రజాప్రతినిధులు

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రమైన సుండుపల్లిలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలను జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడా కారులను పరిచయం చేసుకొని ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు చాలా ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలు పైన ఆసక్తి కలిగించాలని విద్యార్థులు రాష్ట్రస్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సుండుపల్లి మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి క్రీడల్లో ఏర్పాటు చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఎంపిపి రాజమ్మ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని ఇదే స్థాయి నుండి ఉన్నత స్థాయికి క్రీడల్లో వెళ్లాలని అన్నారు. మాజీ ఎంపిపి అజంతమ్మ మాట్లాడుతూ ఈ పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభ చూపి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ. వెంకటేష్ నాయక్, వైసిపి నాయకులు రామస్వామిరెడ్డి, పి.రియాజ్‌ఖాన్, వైస్ ఎంపిపి రెడ్డయ్య, జడ్‌పిటిసి రాయవరం సర్పంచ్, మహమ్మద్ షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ శేషగిరి బాబు

జిల్లా నోడల్ అధికారి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రమైన ములకలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆర్‌బిఎస్‌కె, ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ శేషగిరి బాబు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలో ఎన్‌సిడి, సిడి సర్వేలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. పిహెచ్‌సి పరిధిలోని జనాభాలో సర్వే 90శాతం పూర్తి చేయాలని కోరారు. అలాగే స్టోర్, లేబర్‌రూమ్‌లను పరిశీలించారు. పిహెచ్‌సిలో కాన్పుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పిలు వారికి కేటాయించిన నిర్దేశించిన హెడ్‌క్వార్టర్లలో నివాసముండాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు జాహ్నవి,హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రమైన టి.సుండుపల్లిలో పాత స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ఎస్‌బిఐ ఖాతాదారుల సేవాకేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించిన టి.ఎస్.వెంకటేశ్వర్లు, భరత్‌కుమార్ ఆహ్వానం మేరకు జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ ప్రారంభించారు. మండలంలోని ఎన్ని బ్యాంకులు ఉన్నా ఎక్కువమంది విదేశాలకు వెళ్ళిన వారే ఉన్నారని అన్నారు. బ్యాంకులో లభించే సేవన్నీ ఖాతాదారుల సేవా కేంద్రంలో లభిస్తాయని చెప్పారు. ఖాతాదారులకు అన్ని రకాల బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. మండల ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిసి నాయకులు గంతల చెన్నకృష్ణ, సీనియర్ లీడర్ ఆనంద్‌రెడ్డి, చలపతి, శివరామ్, సునీల్, వినోద్ కుమార్, ప్రసాద్, నజీమ్ పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభమెప్పుడో?

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రారంభం కాని అర్బన్ హెల్త్ సెంటర్

పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అర్బన్ రూరల్, హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి వీటి ద్వారా వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తయి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని గుత్తేదారు కంచి బలరాంరెడ్డి సరి కొత్త హంగులతో నిర్మించారన్నారు. ఈ హెల్త్ సెంటర్ తమ పరిధిలోకి రాదంటూ ఇటు మున్సిపల్ అధికారులు, అటు పంచాయతీ అధికారులు, వైద్యశాఖ అధికారులు తెలుపుతున్నారని పేర్కొన్నారు. అర్బన్‌హెల్త్ సెంటర్ ప్రారంభమైతే సామాన్య,పేద ప్రజలమైన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దన్నారు.అనారోగ్యం బారిన పడినప్పుడు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. హెల్త్ సెంటర్ ప్రారంభమైతే ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న చాలా కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దని, చిన్న, చిన్న వ్యాధులకు దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ఈ హెల్త్ సెంటర్లకు శ్రీకారం చుట్టగా, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారు వాపోతున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మిస్తే, అది నిరుపయోగంగా మారడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అర్బన్ సెంటర్ ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రక్త పరీక్షలపై ఎఎన్ఎంలకు అవగాహన

ప్రజాశక్తి-పీలేరు

ఎఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

హిమోగ్లోబిన్ శాతం, నూటికి నూరు పాళ్ళు కచ్చితంగా చూపే సహలీస్ రక్తపరీక్ష పద్ధతిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంలు, సిహెచ్‌ఒలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, కౌమారదశ ఆడపిల్లల్లో రక్తహీనత నిర్మూలనే ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. వైద్య, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల వారి సమన్వయం తో క్షేత్రస్థాయిలో నిర్వహించే రక్తహీనత నిర్మూలన చర్యల్లో సహలీస్ హిమోగ్లోబిని నిర్ధారణ పద్ధతి చాలా ప్రయోజనకారి అని అన్నారు. పరీక్ష అనంతరం వారి వారి సంబంధిత యాప్ లలో ఫలితాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, సిహెచ్ఒ, అంగ న్వాడీ కార్యకర్తలు, స్కూల్ టీచర్లు, సచివాలయ, గ్రామాల వారీ ఎంత మంది గర్భిణులకు, కౌమారదశ బాలికలకు, రక్తహీనత నమోదు కాబడిందో లైన్ లిస్టు ప్రకారం సంపూర్ణ పోషణ, ఐరన్ ఫోలిక్ మాత్రలు, సంబంధిత ఇంజెక్షన్ల ద్వారా రక్తహీనత సమస్యను నిర్మూలించాలని అన్నారు. కార్యక్రమములో పిహెచ్‌ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఎఎన్ఎంలు, లాబ్ టెక్నీషియన్ సూర్యతేజ పాల్గొన్నారు.

డ్రైయినేజీ కాలువ నిర్మించారు.. శుభ్రత మరిచారు

దుర్గంధం, దోమల బెడదతో అల్లాడుతున్న జనం

ప్రజాశక్తి - రాజంపేట

ఏళ్ల తరబడి డ్రెయినేజీ కాలువ శుభ్ర పరచకపోవడంతో దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ సరిగ్గా చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణ పరిధిలోని సరస్వతీపురం నుంచి ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, సాతుపల్లి మీదుగా పాత బస్టాండ్ వరకు గతంలో డ్రెయినేజీ కాలువ నిర్మించారు. వర్షాలు వచ్చినపుడు మాత్రమే కాలువలో నీళ్ళు ప్రవహించి శుభ్రం అవడం తప్ప ఏ మున్సిపల్ సిబ్బంది పారతో శుభ్రం చేసిన దాఖలాలు లేవని కాలువ పరీవాహక ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. కొందరు గృహ యజమానులు చెత్తను మున్సిపల్ కుండీలో మున్సిపల్ వాహనాల్లో కాకుండా కాలువలో వేయడం కూడా కాలువలో చెత్తా చెదారం పేరుకు పోవడానికి కారణమవుతోంది. దోమల విజృంభణతో తాము తరచూ విష జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు కిలో మీటర్లకు పైగా పొడవు కలిగిన ఈ డ్రయినేజీ కాలువకు అక్కడక్కడా పై కప్పు ఉంటే చాలా ప్రాంతాల్లో పైకప్పు లేకపోవడం శుభ్రపరచడానికి సులువైనప్పటికి యంత్రాంగం ఆ దిశగా నడుం బిగించకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి కాలువను శుభ్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

మురుగు కాలువలో పేరుకు పోయిన చెత్త

తక్షణమే శుభ్రం చేయాలి

ప్రతినిత్యం తాము దోమల బెడద తట్టుకోలేక క్షోభకు గురవుతున్నాం. విష జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవు తున్నాం. ఈ కాలువను మున్సిపల్ సిబ్బంది ఎప్పుడు శుభ్రం చేసిందో మేము ఇంత వరకు చూడలేదు. తక్షణమే కాలువను శుభ్రపరచాలి. విషజ్వరాల బారి నుంచి కాపాడాలి.

-గుండాల రాజేశ్వరి

దోమల బెడద భరించలేకున్నాం

మురుగు కాలువల్లో ప్రవహించాల్సిన డ్రెయినేజీ నీరు ఎక్కడిక్కడ నిల్వ ఉండడంతో దోమల బెడదతో పాటు దుర్గంధం భరించలేక పోతున్నాం. సిబ్బంది ఫాగింగ్ అయినా ప్రతి రోజూ అన్ని వీధుల్లో చేపట్టాలి. దోమల భాద నుండి విముక్తి కల్పించండి.

-నాగినేని సుబ్రమణ్యం

పూడికతీత పనులకు తీర్మానం చేశాం

డ్రెయినేజీ సమస్య తమ దృష్టిలో ఉంది. పూడికతీత పనులు చేపట్టేందుకు ఇటీవలే కౌన్సిల్‌లో తీర్మానం చేశాం. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా అవగాహన కలిగి ఉండాలి. త్వరలోనే పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-ఎం.జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : 'గడికోట'

ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిట్లూరు పంచాయతీ పరిధిలోని చెరువుముందరపల్లె, మజ్జిగవాండ్లపల్లె, శనక్కాయలవాండ్లపల్లె, వీరయ్యగారి ఇండ్లు, రాఘవ రెడ్డిగారిపల్లె, చిట్లూరు హరిజనవాడ, ముసల్ రెడ్డిగారిపల్లె, నారాయణరెడ్డిపల్లెలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులుతో కలసి శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎవరి సిఫారసు లేకుండా, అర్హత ఉన్న వారికి నేరుగా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన, వెంకటరమణ, మార్కెట్ కమిటీ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, గ్రామసర్పంచ్ రామానుజులు, ఎంపిడిఒ హైదర్‌వలీ, మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

మండలంలోని చిట్లూరులో రైతుభరోసా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విత్తనాలను పంపిణీ చేశారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో నాణ్యమైన, నమ్మదగిన వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగానే అందిస్తున్నారన్నారు. 40 శాతం సబ్సిడీతో 30 కిలోల నారాయణి రకం రూ.1773, కె 6రకం రూ.1675 కు అందిస్తారన్నారు. అవసరమైన రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళికలుతో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, విత్తన పంపిణీ సజావుగా జరిగేలా కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వం అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించిందన్నారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- టిడిపి సభ్యుల వాకౌట్

ప్రజాశక్తి-కలికిరి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నూర్జహాన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం ఎంపిడిఒ గంగయ్య ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికార ప్రతిపక్ష సభ్యులు విమర్శ ప్రతి విమర్శలతో సర్వసభ సమావేశం రసాభసగా మారింది. సభలో సభ్యులు, సర్పంచ్లు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేదంటూ, మండలంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక ఇవ్వాలంటూ రెడ్డివారి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అడుగుగా ఇరువురి మధ్య మాటలు యుద్ధం పెరిగి తదనంతరం సభలో టిడిపి సభ్యులు వాకౌట్ చేశారు. ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ మాట్లాడుతూ కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రజా సమస్యల పైన దృష్టి పెట్టకుండా విమర్శించడమే పనిగా పెట్టుకుని అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. గుట్టపాలెం సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎంపిడిఒ కార్యాలయ పరిధిలో ఉన్నటువంటి రూముల వేలంపాటలో మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు అనుమతి లేకుండా ఎలా నోటిఫికేషన్ విడుదల చేస్తారని ఎంపిడిఒపై మండిపడ్డారు. రూముల వేలంపాట గురించి గతంలో ఉన్న మండల అభివృద్ధి అధికారి 2023 మార్చి 31 వరకు ఉత్తర్వులు పొడిగిస్తే మీరు ఎవరు అనుమతి లేకుండా మధ్యలో రూముల వేలంపాటపై నిర్ణయం ఎలా తీసుకుంటారని నిలదీశారు. ఎంపిడిఒ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా తాత్కా లికంగా రూముల వేలం పాటను వాయిదా వేస్తు న్నట్లు ప్రకటించారు. ఎంఇఒ రంగనాథరెడ్డి మాట్లాడుతూ మండ లంలోని ప్రజాప్రతి నిధులు, ప్రభుత్వ అధి కారులు విద్యాసంస్థలో జరిగినటువంటి సమూలమైన మార్పులకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేటట్లుగా సహకరించాలని సభను ఉద్దేశించి కోరారు. తహశీల్దార్ భాగ్యలత మాట్లాడుతూ మండలంలో ఏడు గ్రామాలలో భూరీసర్వే జరుగుతున్నదని దానికి సంబంధించి ఆ గ్రామంలో రైతులు సర్వే అధికారులకు సహకరించి రైతుల సమస్యలను అక్కడకక్కడ పరిష్కరించుకోవాలని కోరారు. రవాణా శాఖ సమస్యలపై పలువురు సభ్యులు మహల్ నుండి కలికిరి, కందూరు నుండి కలికిరి వరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పద్మజా, లోకవర్ధన్, తహశీల్దార్ భాగ్యలత, కో-ఆప్షన్ మేంబర్ రిజ్వాన్, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వేంపల్లి నూర్జహాన్

లక్కిరెడ్డిపల్లి : రైతులకు జీలుగలు, విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచులు

రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గాలివీడు

వేరుశనగ విత్తనకాయల పంపిణీని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి ఎస్.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎఒ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని ఆర్‌బికె అగ్రికల్చరల్ అసిస్టెంట్ హాజంయ్యారు. ఖరీఫ్-2023 వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం గురించి వివరించారు. మండలానికి కె6 విత్తనాలు 1909 క్వింటాళ్లు, నారాయణి ఎర్రకాయలు 261 క్వింటాళ్లు, పచ్చ రొట్టె ఎరువులు, జీలుగులు 38 క్వింటాళ్లు మండలానికి జిల్లా అధికారి కేటాయించినట్లు తెలిపారు. వేరుశనగ కె6 30 కేజీల బస్తా ధర రూ.1674 రూపాయలు, నారాయణి 30 కేజీల బస్తా ధర రూ.1773, జీలుగలు 10 కేజీలు బస్తా ధర రూ.395లని తెలిపారు. అర్ధ ఎకరా భూమి ఉన్న రైతులకి ఒక బస్తా, అర్ధ ఎకరా నుంచి ఎకరా భూమి ఉన్న రైతుకి రెండు బస్తాలు ఎకరా పైన భూమి ఉన్న రైతులకి గరిష్టంగా మూడు బస్తాలు ఇస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి రైతు భరోసా కేంద్రంలో విత్తన రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతుందని, మండలంలోని రైతులందరూ రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తన కాయలు తీసుకోవాలని కోరారు. **లక్కిరెడ్డిపలి :** అనంతపురం గ్రామ రైతు భరోసా కేంద్రం నందు పచ్చిరొట్ట ఎరువులుగా ఉపయోగపడే జీలుగ విత్తనాలను సర్పంచులు వెంకటనారాయణ రెడ్డి కళ్యాణి ప్రభాకర్ రెడ్డిలు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు మాట్లాడుతూ జీలుగ విత్తన సబ్సిడీ 50 శాతం కాగా, ఒక్కో 10 కేజీల ప్యాకెట్ ధర 395 రూపాయలని, విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకొని, నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించిన రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఖలీమ్‌కు సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్‌ను పీలేరులో మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన అబ్దుల్‌ఖలీమ్‌ను శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలీమ్ తండ్రి దివంగత జలీల్ సాహెబ్ సేవలను కొనియాడారు. జిల్లా రాజకీయాల్లో మైనార్టీ నేత జలీల్ సాహెబ్ క్రియాశీలక పాత్ర పోషించారని, ఆయన వారసుడిగా కలీమ్ రాష్ట్రస్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని అధిష్టించడం నియోజకవర్గంలోని మైనారిటీలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ హుమయూన్, ముతవల్లీలు గడిబాషా మోదీన్, అల్లావుద్దీన్, ముస్తఫా హజరత్, గృహసారధుల మండల అధ్యక్షుడు ఆనంద్, టూరిజం డైరెక్టర్ షాకీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మునీర్, డిఇ కరీముల్లా, న్యాయవాది షౌకత్ అలీ, ఎంపిటిసి నరసింహారెడ్డి, నాయకులు జిలానీ సాహెబ్, మక్బూల్ బాష, రెడ్డిబాషా, ఆబిద్, అల్లాబకాష్, కాలేష, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు మెరుగైన సదుపాయాలు

ప్రజాశక్తి-కలికిరి

హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు మెరుగైన సదుపాయాలు ప్రభుత్వం కనిపిస్తుందని ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హజ్ యాత్రకు వెళ్లే ప్రాంగనాన్ని పరిశీలించి హజ్ యాత్రకు ఎర్పాట్లు సంతృప్తి కరంగా కొనసాగుతున్నాయని ఆయన పెర్కొన్నారు. హజ్ యాత్రికులకోసం తాత్కాలిక హజ్ హౌస్‌ను మెంబెర్ సిరాజుల్ ఉలూమ్ తో కలసి మదరసలో ఏర్పట్లను అయన పరిశిలించారు. ప్రాంగణమంతా తిరిగి స్థానిక హజ్ కమిటి సిబ్బందిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా అయన మాట్లడుతూ రాష్ట్రం నుంచి తొలిసారిగా హాజిలు విజయవాడ అంతర్జాతీయ విమనశ్రయం నుంచి పవిత్రమక్కా, మదీన నగరాలకు నేరుగా విమానాల్లో వెళ్తున్నారన్నారని, టికెట్ ధరలో వ్యత్యాసం గురించి డిప్యూటీ సిఎం అంజాద్ బాషా , ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటి చైర్మన్ బి ఎస్ గౌసల్ అజాం సిఎం జగన్మోహనరెడ్డి దృష్టి కి తీసుకెళ్ళగానే అయన వ్యత్యాసం ప్రభుత్వం భరిస్తుందని చెప్పి , భారీ మొత్తన్ని హాజిల ఖాతాల్లో జమచేయడం ఒక అద్భుతం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు కమిటి సభ్యులు సయ్యద్ సుభానీ, హజ్ కమిటి సిబ్బంది పాల్గోన్నారు.



హజ్‌యాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముస్లిం మైనార్టీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్

అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజనులు

ప్రజాశక్తి-సుండుపల్లి

గుడిసెల్లో నివాసముంటున్న గిరిజనులు

మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలోని అన్నమయ్య, చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో నివసిస్తున్న కొందరు గిరిజనులు (యానాదులు) అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. ఎటువంటి ప్రభుత్వ పథాకలకు నోచుకోక గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోక దుర్భర జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు. వారికి ఆధార్ కార్డులుగానీ, రేషన్ కార్డులు గానీ మంజూరు కాలేదన్నారు. మా ప్రాంతం అటవీ ప్రాంతంలో ఉండడంతో అధికారులు మేము ఉన్నా లేనట్లేనన్న విధంగా లెక్కలేసుకుంటున్నారని వాపోయారు. గతంలో కూడా మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మా గురించి పట్టించుకున్న పాపన పోలేదన్నారు. నిరుపేదలందరికీ పక్కా గృహాలు ఇస్తామని ప్రభుత్వం ఒకపక్క చెప్తుంటే మాకు మాత్రం వర్తింపచేలేదన్నారు. ప్రజాప్రతినిధులు ఓట్లు వచ్చినప్పుడు మా గ్రామాన్ని గుర్తిస్తారని లేకపోతే మా గురించి పట్టించుకోరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మాకు ప్రభుత్వం నుంచి అందవలసినటువంటి పథకాలనుఅందేలా చూడాలని కోరారు. మౌళిక వసతులు కల్పించాలని కోరారు.

పవర్‌లిఫ్టింగ్‌లో బాలికకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి-వీరబల్లి

గోల్డ్ మెడల్ సాధించిన ప్రసన్న

పవర్ లిఫ్టింగ్‌లో పోటీల్లో మండలంలోని మట్లి గ్రామానికి చెందిన ప్రసన్న అనే బాలిక గోల్డ్ మెడల్ సాధించిందని వైసిపి బిసి సెల్ అధ్యక్షుడు మోడెం నాగభూషణం తెలిపారు. ఈ నెల 20న తెనాలిలో జగిగిన 10వ పవర్ లిఫ్టింగ్ జూనియర్ బాలికల విభాగంలో వీరబల్లి మండలం,మట్లి తోగటపల్లికు చెందిన దేవరింటి శివరాం, సుగుణల కుమార్తె ప్రసన్న గోల్డ్ మెడల్ సాధించిందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవర్‌లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయికి ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. గ్రామానికి, మండలానికి మంచి పేరు తెచ్చిందని అభినందించారు. ప్రస్తుతం ఇడు పులపాయలో ఐఐఐటి ఇసి బ్రాంచ్ మూడవ సంవత్సరం చదువుతుందన్నారు.

తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండల కేంద్రంలోని సుండుపల్లె గ్రామ పంచాయతీలో కటవక్రిందపల్లి గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని పసుపులేటి రమణయ్య పేర్కొన్నారు. ఇక్కడ తాగునీరు బోరు వేశారుగానీ, పైపులైన్లు తీయలేదని అనేకసార్లు పంచాయతీ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని పాపాన పోలేదన్నారు. లక్షలాది రూపాయలు పంచాయతీ నిధులు ఉన్నా కూడా తాగునీటి సమస్య పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, పశువుల సంతలోనే దాదాపుగా రూ.28 లక్షల మేర పంచాయతీకి ఆదాయం వస్తోందన్నారు. ఈ పంచాయతీ పరిధిలో 52 గ్రామాలు ఉన్నాయని, ఏ ఒక్క గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేదన్నారు. అసలే వేసలి కాలం కావడంతో ప్రజలు దాహంతో అల్లాడి పోతున్నారని అన్నారు. సమయానికి తాగునీరు రాకపోవడంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగు నీటి సమస్యను పరిష్కరించి ప్రజల దాహర్తిని తీర్చాలని కోరారు.

శ్రీహరికోట చూసొద్దాం రండి..

పీలేరు : శ్రీహరికోటలో రాకెట్టు పంపిస్తారంట.. రండి చూసొద్దాం... అని పీలేరు ఆర్‌టిసి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కెవి.రమణ అసక్తులను ఆహ్వానిస్తున్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జిఎస్ఎల్ విఘ్-12 ద్వారా ఎన్‌విఎస్-01 ఉపగ్రహాన్ని ఈనెల 29న తిరుపతి జిల్లా, శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఉదయం 10.42 గంటలకు రాకెట్ నింగిలోకి పంపనున్నారని అన్నారు. అది ప్రత్యక్షంగా వీక్షించడానికి ఆసక్తి చూపే వారి కోసం పీలేరు ఆర్‌టిసి డిపో నుంచి శ్రీహరికోటకు డిపో మేనేజర్ బండ్ల కుమార్ ప్రోత్సాహంతో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పీలేరు నుంచి శ్రీహరికోటకు రాను పోను పల్లెవెలుగు బస్సు చార్జీ రూ.520 మాత్రమేనని పేర్కొన్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం ఖర్చులు ఎవరికి వారే భరించుకోవాలని తెలిపారు. పీలేరు, పరిసర ప్రాంత విద్యార్థులు, ఆ సక్తిగల వారు www.apsrtc.in బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం పీలేరు డిపో మేనేజర్ 9959225679 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

పంచాయతీ ట్రాక్టర్లలోని బ్యాటరీలు చోరీ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీకి సంబంధించిన చెత్త ట్రాక్టర్లలోని రెండు బ్యాటరీలను గుర్తుతెలియని దొంగలు గురువారం రాత్రి అపహరించుకు వెళ్లారు. పాత గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న రెండు ట్రాక్టర్ లకు సంబంధించి న బ్యాటరీలను దొంగలించారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం నిధులకు హాజరైన సిబ్బంది గమనించారు. రెండు రోజుల క్రితం గొల్లపల్లిలో పంచాయతీ కేబుల్ వైర్ దొంగలించగా తాజాగా రెండు ట్రాక్టర్ల బ్యాటరీలను అపహరించుకు వెళ్లడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పీలేరు

మృతి చెందిన వెంకటయ్య

కారు ఢీ కొని రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన గురు వారం రాత్రి పీలేరులో చోటు చేసుకుంది. రొంపిచర్ల మండలం, మోటుమల్లెల పంచాయతీ, దాసరి గూడెంకు చెందిన తుపాకుల వెంకటయ్య (63) గురువారం సాయంత్రం మదనపల్లి సమీపంలో ఓ ప్రయివేట్ బస్సుకు జరిగిన ప్రమాదంలో తన కుమార్తె మాధవి గాయపడ్డంతో ఆమెను వైద్యం కోసం పీలేరు పట్టణం, తిరు పతి రోడ్డు లోని శశి ఆర్థో ఆసుపత్రికి తీసుకొచ్చాడు. ఆమెకు చికిత్స అందుతున్న క్రమంలో వెంకటయ్య మూత్ర విసర్జన కోసమని ఆస్పత్రి ఎదురుగా రోడ్డు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో తిరుపతి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు అతన్ని ఢీ కొంది. ఈ ఘటనలో వెంకటయ్య తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బొలెరో, ద్విచక్ర వాహనం ఢీకొని మరొకరు..

గుర్రంకొండ : మండల కేంద్రంలోని కదిరాశి చెరువు క్రాస్ వద్ద బొలెరో వాహనం, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలు అయిన సంఘటన శుక్రవారం చేసుకుంది. ఎస్ఐ దిలీప్ కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలావున్నాయి. మండల కేంద్రంలో జరుగుతున్న వారపు సంతను ముగించుకొని సరిమడుగు పంచాయతీకి చెందిన లక్ష్మీనారాయణ ద్విచక్ర వాహనంలో బయలుదేరుతుండగా చెర్లోపల్లి గ్రామం ఎగువ తొట్లవారిపల్లికి చెందిన కనకమ్మ లిఫ్ట్ అడగడంతో ఆమెను బండిపై ఎక్కించుకొని కదిరాయి చెరువు క్రాస్ వద్ద మలుపు దాటుతుండగా కడప రోడ్డు నందు వస్తున్న బులోరా వాహనం ఢీకొనడంతో కనకమ్మ అక్కడికక్కడే మృతిచెందగా గాయపడిన లక్ష్మీనారాయణ ను ఆసుపత్రికి తరలించి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.